ప్రజాశక్తి

సోమవారం 1 సెప్టెంబర్ 2025

I

అల్లూరి సీతారామరాజు

రూ.6 వేల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకువేలి మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగుడ గ్రామంలో జన్ని సీతమ్మ ,(57) అనారోగ్యంతో గత నెల 26వ తేదీన మరణించింది. దీంతో గ్రామ పెద్దల నిర్ణయం ప్రకారం శరభగుడ గ్రామ యువకులు ప్రతీ ఇంటికి 100 రూపాయలు చందాలు ఎత్తుకొని జన్ని సీతమ్మ కుటుంబానికి 6 వేల రూపాయలు యువకులు, గ్రామ నాయుడు కిల్లో జగన్నాథం చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయుడు కిల్లో జగన్నాథం యువకులు కిల్లో ఆనంద్, కిల్లో మోహన్, పాంగి కళ్యాణ్, బురిడి రాజు ,లక్ష్మణ్,వాసు, మహేష్, గణేష్ పాల్గొన్నారు.

నగదు ఇస్తున్న యువకులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై ఉధృత ఉద్యమం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలు, హక్కుల్ని కాలరాస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అదానీ, నవయుగ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని, గిరిజన చట్టాల్ని తుంగలో తొక్కి నిర్మాణాలు చేపడితే ఉద్యమం ఉధృతం చేస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం హెచ్చరించారు. ఆదివారం అరకులోయలో జరిగిన సిపిఎం జిల్లా సమావేశం సందర్భంగా స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ఐదో షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ హక్కులను, పీసా, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టాన్ని ఉల్లంఘించి ప్రైవేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి వేల ఎకరాల అటవీ, జిరాయితీ భూములను కేటాయించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. పచ్చని అడవులు, సాగు భూములను నాశనం చేసే ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పారు. జిల్లా ఎస్పీ శాంతిభద్రత కోసం చూడాలి తప్ప ప్రాజెక్టుకు అనుకూలంగా నాయకులని పిలిపించి అభివృద్ధి అని చెప్పడం విడ్డూరమన్నారు. 5 షెడ్యూల్ ప్రాంతంలో ప్రాజెక్టు కోసం నోటీసులు ఇచ్చే అధికారం ఎంఆర్ఓలకు లేదన్నారు. గ్రామసభ, పేసా కమిటి అనుమతి లేకుండా సర్వేలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీలను అడవి నుంచి గెంటివేసే ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. ప్రైవేటు కంపెనీల లాభాల కోసం గిరిజనుల ప్రాణాలను బలి తీసుకుంటారా ప్రశ్నించారు. అల్లూరి జిల్లాలో పెదకోట, గుజ్జెలి, చిట్టెంపాడు ప్రాంతంలో హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన జీఓ 51ను రద్దు చేయాలన్నారు. అటవీ హక్కుల, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలను మోడీ ప్రభుత్వం నీరు గారుస్తోందని విమర్శించారు.గిరిజనులు కొండ కోనల్లో నివసించే ఆదిమ తెగ ఆదివాసీల (పివిటిజి) సమస్యలు పరిష్కరించవలసిన ప్రభుత్వాలు గాలికి వదిలేసి ప్రైవేటు వ్యక్తులకు కొమ్ము కాయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.మెగా డిఎస్సి విషయంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఆదివాసీలకు హాని కలిగించే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఉమమహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

వంతెన మరమ్మతులు చేపట్టాలి

వంతెనను పరిశీలిస్తున్న సురేంద్ర, గంగరాజు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం యండపల్లివలస, అరకు మధ్య వంతెన ప్రమాదకరంగా ఉన్న వంతెనను వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు,ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఆదివారం యండపల్లివలస, అరకు మధ్య వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశంలో ప్రమాదకరంగా ఉన్న వంతెనను మరమ్మతులు చేపట్టాలని ప్రస్తావించడం జరిగిందని, దీనిపై జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పందిస్తూ మరమ్మతులు చేయిస్తానని జిల్లా పరిషత్ సమావేశంలో హామీ ఇచ్చారని, నేటికి చేపట్టలేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వంతెన ప్రమాదాలకు నిలయంగా మారుతోందని, జిల్లా అధికారులు,ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు చేస్తున్నా ఎందుకు మరమ్మతులు చేపట్ట లేదని ప్రశ్నించారు.విశాఖ నుండి అరకు రోడ్డు 516 ఈ చిలకలగెడ్డ నుండి మొదలుకొని అనంతగిరి మండలం, అరకులోయ మండలం యండపల్లివలస వరకు గతుకులమాయంగా మారి ప్రయాణికులకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.డముకు సమీపంలో గతుకుల మయంగా మారి ప్రయాణికుల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగి రెండు రోజుల పాటు ట్రాఫిక్ జామ్ అవడంతో అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం బృందం శ్రమదానం చేసి అంతరాయం తొలగించామన్నారు.చిలకలగెడ్డ మొదలుకొని అరకు వరకు గుంతలు ఏర్పడిన చోట పూడ్చి బీటి రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి యండపల్లివలస, అరకు వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉందని మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇన్‌ఛార్జి పాలన ఇంకెన్నాళ్లు?

-సకాలంలో సేవలందక ఇబ్బందుల్లో గిరిజనులు
-9 నెలలైనా ఐటిడిఎ పిఒను నియమించని వైనం



ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎలో ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారింది. ఐటిడిఎకు పెద్ద దిక్కు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఐటిడిఎ కీలక పోస్టు ఇన్చార్జితోనే పాలన కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు నామమాత్రంగా అందుతున్నాయి. మరోవైపు గిరిజనాభివృద్ధి, విద్య కుంటుపడుతోంది. గిరిజన అభివృద్ధికి కీలకమైన ఐటిడిఎ కార్యాలయానికి రెగ్యులర్ పిఒ లేరు.

9 నెలలు క్రితం ఇక్కడ పనిచేస్తున్న పిఒ వి.అభిషేక్ పోలవరం ప్రాజెక్ట్ ఎఒగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడను ఐటిడిఎ ఇన్చార్జి పిఒగా నియమించారు. ఫలితంగా పాలన గాడి తప్పి ప్రజా సంబంధాలు, కార్యాలయ కలాపాలు అటకెక్కాయి. ఏ పనిముందుకు సాగాలన్న ఇన్చార్జి అనే కారణంతో వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బాధ్యతలు చేపట్టి అతిథి పాత్ర పోషిస్తుండటంతో ఆయా శాఖల్లో పారదర్శక పాలన, పర్యవేక్షణ లోపించింది. కింది స్థాయి అధికారులు, ఉద్యోగ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కీలకమైన రెండు పోస్టుల పనిభారంతో ఇన్చార్జి పిఒ కూడా విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారింది. గిరిజన అభివృద్ధికి రెండు కార్యాలయాల్లో సేవలందించాల్సి రావడంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. దీంతో ఏ కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో అర్థం కావట్లేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు సకాలంలో జరగక జాప్యమవుతోంది. పిఒ లేకపోవడంతో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఫలాలు, మెనూ అమలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పాడేరు ఐటిడిఎకు రెగ్యులర్ పిఒను నియమించి పాలన సక్రమంగా కొనసాగేలా గిరిజనాభివృద్ధి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

ఐటిడిఎపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి అత్యంత కీలకమైన ఐటిడిఎపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. నెలల తరబడి ఐటిడిఎకు రెగ్యులర్ పిఒను నియమించకుండా నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వ అధికారులు అన్నివేళలా అందుబాటులో ఉండడం లేదు. గిరిజనుల అభివద్ధి, విద్యపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయం. ఐటిడిఎ పరిపాలనకు కీలకమైన పోస్టు రెగ్యులర్ పిఒను నియమిస్తే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది.

పి.అప్పలనర్స
ఆదివాసీ గిరిజన సంఘం నేత

రోడ్డు నిర్మించాలని శ్రమదానంతో నిరసన

శ్రమదానంతో నిరసన చేపడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని పెసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పెసా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ గ్రామస్తులు సిసి రోడ్డు నిర్మించాలని కోరుతూ శ్రమదానం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడపవలస గ్రామంలో మెయిన్ రోడ్డు సిసి రోడ్డు నుంచి అంగన్వాడీ వరకు సుమారుగా 300 మీటర్లు వరకు సిసి రోడ్డు లేక అంగన్వాడీకి వెళ్లే ప్రీస్కూల్ చిన్నారులు, గ్రామస్తులు వర్షా కాలంలో రాకపోకలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు నడిచే దారిలో ఇరువైపులా తుప్పలు ఉండడంతో విష సర్పాల భయంతో భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని అడపవలస గ్రామంలో సిసి రోడ్డు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పి.హరి, పి శ్రీకాంత్, టి ప్రభాస్, జి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో..

వరద గోదావరి ఉధృతి తగ్గలేదు. ఆదివారం ఉదయం 48 అడుగులకు చేరుకుని సాయంత్రం స్వల్పంగా తగ్గి 47.50 అడుగులకు చేరుకుంది. విఆర్‌పురం, ఎటపాక, కూనవరం మండలాల్లో పలు గ్రామాలు నీటమునిగాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నిత్యావసరాలు అందించాలని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టలపై పాకలు వేసుకుని ఉంటున్న నిర్వాసితులు విషపురుగులతో అవస్థలు పడుతున్నారు. నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని వాపోతున్నారు.

- రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి వద్ద నిలకడగా నీటిమట్టం
- ముంపు గ్రామాలకు రాకపోకలు బంద్..
- నిత్యావసరాలు సరిగా అందక అవస్థలు
- విఆర్‌పురం, ఎటపాక, కూనవరం మండలాల్లో పలు గ్రామాలు నీటమునక

ముంపునకు గురైన ఒడ్డుగూడెం కాలనీ

ఎటపాక: గ్రామస్తులను వరద వైపు వెళ్లొద్దని హెచ్చరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎటపాక: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయం 48 అడుగులకు చేరుకుని సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 47.50 అడుగుల వద్ద ఉంది. మురుమూరు, వీరాయిగూడెం గ్రామాలకు వెళ్లే ప్రధానరహదారిపై వరదనీరు చేరడంతో ఆ గ్రామస్తులు బయటకు రావడానికి అవకాశం లేదు. ప్రభుత్వ అధికారులు ఎవరూ తమ వైపు కన్నెత్తి చూడడం లేదని, నిత్యవసరాలు అందించలేదని వీరాయిగూడెం గ్రామానికి చెందిన కంగాల గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రోడ్డు బ్లాకింగ్ పాయింట్ వద్ద వరద నీటిలోకి ఎవరు వెళ్లకుండా పోలీసులను కాపలా పెట్టారు. తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఒ ప్రేమ్‌సాగర్ నందిగామ మురుమూరు గ్రామాల్లో వరద నీరు చేరుకున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య పడవ ఏర్పాటు చేశామని అత్యవసర పరిస్థితి వస్తే వినియోగించుకోవాలని గ్రామస్తులకు తహశీల్దార్ సుబ్బారావు సూచించారు.

విషపురుగుల మధ్య ఉంటున్నాం..

విఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరిలో ఇళ్లలోకి వరద నీరు వస్తోంది. దీంతో గ్రామస్తులు గుట్టలపై పాకలు వేసుకుని ఉంటున్నారు. విషపురుగుల మధ్య జీవిస్తున్నామని, మూడు రోజుల నుంచి రోడ్డు మునిగిపోయి నిత్యావసర వస్తువులకు చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు ఒకరోజు వచ్చి పది ఇళ్లకు కూరగాయలు పంచి ఫోటోలు దిగి వెళ్లిపోతున్నారని, మిగతా వారి పరిస్థితి ఏంటని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. 41.5 కాంటూర్ పరిధిలో కొల్లూరు నుండి జీడిగుప్ప కల్తునూరు శ్రీరామ్‌గిరి సీతంపేట వరకూ నిర్వాసితుల పునరావాస కాలనీలు అసంపూర్తిగా ఉన్నాయని మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలి ఈ ప్రభుత్వానికి అని ప్రశ్నించారు. మరో వారం పాటు వరద ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు.

ముంపు బాధితులకు నిత్యావసరాలు అందించాలి

మండలంలో జలదిగ్బంధంలో చిక్కుకున్న అన్ని గ్రామాల వరద బాధితులకు నిత్యావసరాలు, వైద్యసదుపాయలు తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదివారం జెడ్పిటిసి వల్ల రంగారెడ్డి తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందించారు. టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బొర్రా నరసింహారావు, బీరక ప్రకాశరావు కూడా వినతిపత్రం అందించారు.

వైసిపి నాయకుల వినతి

మండలంలోని వరద బాధితుల సమస్యలపై మండలంలోని తహశీల్దార్‌ను కలసి వైసిపి మండల అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు వినతిపత్రం అందించారు.

చింతూరు: ఆంధ్ర ఒడిస్సా జాతీయ రహదారి 326 ఆదివారం మళ్లీ నీట మునిగింది. సోకులేరు వద్ద వరద ప్రవాహం తగ్గకపోవడంతో వారం రోజులుగా చింతూరు- విఆర్‌పురం రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. గోదావరికి ఎగువన ఉన్న ఇంద్రావతి వరద ప్రవాహం పాతగూడెం వద్ద తగ్గుముఖం పట్టి, ప్రస్తుతం నిలకడగా ఉంది. మండలంలో సూటూరు నుండి ముకునూరు, చింతూరు నుండి చుట్టూరు రోడ్డు, చెట్టు నుండి కుమ్మూరు, నిమ్మలగూడెం నుండి కొయ్యూరు రోడ్లు నీట మునిగాయి. చింతూరులో కంట్రోల్ రూమ్ నెంబరు 9492527695. అత్యవసర పరిస్థితిలో ఈ నంబర్‌ను బాధితులు సంప్రదించాలని అధికారులు తెలిపారు.

కూనవరం : తెలంగాణ, ఆంధ్రా, ఒడిస్సాలో కురుస్తున్న వర్షాలకు శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తింది. శబరి, గోదావరి సంగమం కూనవరం వద్ద గోదావరి నిండుకుండను తలపిస్తోంది. 47 అడుగులు నీటిమట్టం రావడంతో మండలానికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మురుమూరు వద్ద ప్రధాన రహదారిపై నీళ్లు రావడంతో భద్రాచలం వెళ్ళడానికి రాకపోకలు బంద్ అయ్యాయి. ఉదయభాస్కర్ కాలనీ బాధితులు రెండోసారి పునరావాస కేంద్రాలకు తరలి వెళ్తున్న పరిస్థితి నెలకొంది.

నిత్యావసరాలు పంపిణీ చేయాలి : సిపిఎం

విఆర్‌పురం: విలీన నాలుగు మండలాల్లో వరదలకు మండల కేంద్రానికి రాకపోకలు బంద్ అయ్యాయని దీంతో నిత్యవసరాలు అందక వరద బాధితులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే వరద బాధితులకు నిత్యావసరాలు, కిరోసిన్, దోమతెరలు పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ముంపు గ్రామాలను వారు పరిశీలించారు. శ్రీరామగిరి, చొక్కనపల్లి బాధితుల తో మాట్లాడారు. కేవలం కొన్ని కుటుంబాలకే టార్పాలిన్స్, బియ్యం ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే బాధితులకు నిత్యావసర సరుకులు, దోమతెరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. . చిన్నమటపల్లి ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సిపిఎం మండల నాయకులు పడం శ్రీరామమూర్తి, తోడంరాజు, కమ్మ చిచ్చు, సత్తిబాబు, గొంది దారయ్య, శ్రీరామ్‌గిరి శాఖ కార్యదర్శి ఆత్మకూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న సిపిఎం నాయకులు

రంపచోడవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఈతపల్లి సిరిమల్లి రెడ్డి

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి వద్దు రంపచోడవరం ముద్దు అనే నినాదంతో రంపచోడవరంలోని వివిధ గిరిజన సంఘాల నాయకులు ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆదివాసీ ప్రాంతాలను కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారని, భౌగోళికంగా, పరిపాలనాపరంగా ఇది పెద్ద జిల్లా అని తెలిపారు. ఈ నేపథ్యంలో దాన్ని విడదీసి రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా చేయాలని ఎప్పటి నుంచో తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా ఏర్పాటు కోసం ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రత్యేక జిల్లాను ప్రకటించకుంటే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వాణిశ్రీ, రంపచోడవరం ఎంపిపి బంధం శ్రీదేవి, చదల లచ్చిరెడ్డి, బాలు అక్కిస, గొర్లె చిన్న నారాయణ, పాండా రామకృష్ణ, అంజిరెడ్డి వివిధ సంఘాల పెద్దలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సమావేశం

రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి ప్రత్యేక జిల్లా ఏర్పాటు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు అంతా కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈతపల్లి సత్యనారాయణరెడ్డి, సాదల విద్యాసాగర్‌రెడ్డి, మారేడుమిల్లి మండల నాయకులు పల్లాల భూపతిరెడ్డి, బట్టలచ్చిరెడ్డి, బచ్చెల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం వేస్తున్న దృశ్యం

వినాయక లడ్డూ రూ. 31,216

ప్రజాశక్తి-జికెవీధి: చినజడుమూరులో వినాయకుని లడ్డూ వేలం పాటను రూ.31,216కు స్వగ్రామానికి చెందిన దేశగిరి లింగమూర్తి కుటుంబం సొంతం చేసుకున్నారు. ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు పాల్గొన్నారు.

బుట్టాయిగూడెంలోనే భూమి ఇవ్వాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీలో గల గుండుగూడెంచింతరేగుపల్లి గ్రామంలో పోలవరం నిర్వాసితులు ఆదివారం గ్రామకమిటీ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ పిట్ట రామారావు పీసా ఉపాధ్యక్షుడు కోటం జయరాజు మాట్లాడుతూ తమకు గతంలో రాజమంగి, ఎటపాక గ్రామాల్లో భూమి చూపించిన అధికారులు ఇప్పటివరకూ దీనికి సంబంధించి అధికారుల నుంచి పూర్తి సమాచారం లేదన్నారు. జీలుగుమిల్లి మండలం బుట్టాయిగూడెం మండలం పరిధిలో భూమి, ఇల్లు కూడా అక్కడే ఇవ్వాలని అధికారులను కోరారు. కమిటీలను ఎన్నుకున్నారు. సర్పంచ్ పిట్ట రామారావు కోటం జయరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ వర్ధంతి సభకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-జీకే వీధి : మండలంలోని 2న దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని జికె వీధి మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ తెలిపారు. మండల వైసిపి శ్రేణులు, పలు పదవుల్లోఉన్న నాయకులు, కార్యకర్తలు అంతా హాజరు కావాలని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, హామీ మేరకు కార్మికుల సంక్షేమ బోర్డులు పునర్ధురించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అల్లూరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వితీయ మహాసభ అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు భవన నిర్మాణ కార్మికులులో నిరుద్యోగులు పెద్ద ఎత్తున కూలీలుగా ఉన్నారన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వారిని గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు, వృత్తి పరికరాల కోసం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సంక్షేమ బోర్డు పునరుద్ధరణకై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈనెల 15 తేదీన విజయవాడలో జరిగే కార్మిక కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు రవి, సింహాచలం, సోమనాయుడు, చిన్న, ప్రభుదాసు, శ్రీను, ముంచినపుట్టు, అనంతగిరి, డుంబ్రిగూడ, హుకుంపేట,పాడేరు తదితరు మండలం నుండి కార్మికులు హాజరయ్యారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల

శిథిలావస్థలో చీడివలస పాఠశాల

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రమాదపు టంచున చీడివలస ప్రాథమిక పాఠశాల చేరుకుంది. దీంతో 30 మంది పైగా విద్యార్థులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ పాఠశాల లోపల చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలంతా పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. పైకప్పు ముందు భాగం లోపల స్లాబ్ పెచ్చులు విరిగి పడుతున్నాయి, అంతే కాకుండా కింద బాగం గచ్చు శిథిలావవస్థకు చేరింది. కురుస్తున్న వర్షాలకు భవనమంత తడిసిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో అని భయాందోళనలతో విద్యార్థులు గడప వలసిన పరిస్థితి నెలకొంది. పాఠశాల భవనం నిర్మించి పదేళ్ల కాకుండానే శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు తెలిపారు.పనుల ప్రవేక్షణలో సంబంధిత ఉన్నతాధికారుల నిర్లక్ష్య కారణంతోనే త్వరగా శిథిలావస్థకు చేరుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాడైన ఈ భవానాన్ని పూర్తిగా తొలగించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

కొంపముంచిన బ్యాలెన్స్ చెకింగ్

- బ్యాంకు ఖాతాలోని తల్లికి వందనం నగదు మాయం
- ఆధార్‌తో 'ఫినో'నిర్వాహకులు కొట్టేసినట్లు అనుమానం
- నెలలు గడిచినా బాధితురాలికి జరగని న్యాయం

పత్రాలు చూపుతున్న బాధితురాలు పుష్పవతి

ప్రజాశక్తి.-చింతపల్లి: తల్లికి వందనం నిధులు బ్యాంకు ఖాతాల్లో పడ్డాయో? లేదో తెలుసుకోవడానికి ఆధార్ నెంబరుతో బ్యాలెన్స్ చెకింగ్ కొంపముంచింది. ఏకంగా ఖాతాలోని నగదు మాయమై నెలలు గడస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. వివరాలివి. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ చిన్నయ్యపాలేనికి చెందిన గిరిజన మహిళ లకే పుష్పవతి తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ ఆయ్యాయో? లేదో తెలుసుకునేందుకు జూన్ 13న చింతపల్లి వెళ్లింది. నర్సీపట్నం స్టేట్ బ్యాంక్‌లో ఖాతా ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో చింతపల్లి యూనియన్ బాంకు ఎదురుగా గొడుగు వేసుకుని ఉన్న ఫినో బ్యాంకు నిర్వాహకుని వద్దకు వెళ్లి ఆధార్ నెంబరుతో బ్యాంకు అకౌంట్‌లోని డబ్బులు చెక్ చేయించింది. ఖాతాలో రూ.26వేలు జమ అయ్యాయని ఫినో బ్యాంక్ నిర్వాహకుడు చెప్పగా, అప్పటికి డబ్బులు అవసరం లేకపోవడంతో విత్‌డ్రా చేయకుండానే ఇంటికి వెళ్లిపోయింది. వారం రోజుల క్రితం డబ్బులు విత్‌డ్రా చేసేందుకు చింతపల్లి రాగా, తన ఖాతాలో డబ్బులు లేవని తెలుసుకొని వెంటనే ఖాతా ఉన్న నర్సీపట్నం స్టేట్ బ్యాంకు వెళ్లి వాకబు చేసింది. ఆధార్ నెంబరు ద్వారా బయట ఫినో వాళ్ల నుంచి నాలుగు విడతలుగా మొత్తం డబ్బులు డ్రా అయ్యాయనిబ్యాంక్ అధికారులు చెప్పడంతో ఖంగుతింది. నాటి నుండి నేటి వరకు నాయకులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినా ఏ ఒక్కరూ స్పందించడం లేదని, న్యాయం జరగలేదని వాపోతోంది. ఫినో బ్యాంకు యూజర్ నేమ్ 14372 నర్సీపట్నం బజార్ అని చూపుతుండగా, ఇప్పటికైనా దీనిపై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధిత మహిళ పుష్పవతి వేడుకుంటోంది.

అంధకారంలో డుంబ్రిగుడ

వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్న స్థానికులు



వెలగని లైటు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానిక మండల కేంద్రం వాసులు రాత్రివేళల్లో రాక పోకలకు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని హైవే రోడ్డు పై లైట్లున్నప్పటికీ గ్రామం లోపల వీధి దీపాలు వెలగలేదు. రాత్రుల్లో చిమ్మ చీకటిగా ఉండటంతో హైవే రోడ్డు నుంచి గ్రామం లోపలికి వెళ్లాలంటే విష జంతువులతో భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనికి తోడు ఇరుగు పొరుగు ఇళ్లకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు వారాల నుంచి వీధి దీపాలు వెలగక పోయినా ఇప్పటివరకు పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. వీధి దీపాలు ఉన్నప్పుడు 24 గంటలు వెలిగినా ఎవరు పట్టించుకునే వారు కాదని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం అవి మరమత్తుకు గురైనా పునరుద్ధరించడంలో అధికారులు పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారనీ, వీధి దీపాలు పునరుద్ధరించడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని మండల కేంద్రం వాసులు తెలిపారు.

ముమ్మరంగా యాంటీ లార్వా ఆపరేషన్

బావుల్లో గంభూషియా చేపలు వదులుతున్న మలేరియా సిబ్బంది

ప్రజాశక్తి- చింతపల్లి : దోమలు, లార్వాల వ్యాప్తిని అరికట్టేందుకు మలేరియా విభాగం ముమ్మురంగా యాంటీ లార్వా ఆపరేషన్ చర్యలు చేపడుతోంది. చెరువులు, పాడుబడ్డ బావుల్లో దోమల లార్వాను నియంత్రించేందుకు గంభూషియా చేపలను వదిలినట్లు సబ్ యూనిట్ అధికారి బుక్క చిట్టిబాబు తెలిపారు. శనివారం పిహెచ్‌సి పరిధిలోని లంబసింగి, తాజంగి, లోతుగడ్డ, కోరుకొండ ప్రాంతాల్లో గంభూషియా చేపలను విడిచిపెట్టారు. దోమలు లార్వా దశలోనే ఎక్కువగా పెరుగుతాయని, గంభూషియా చేపలు వాటిని ఆహారంగా తీసుకోవడంతో దోమల పెరుగుదల గణనీయంగా తగ్గుతుందనివివరించారు. కార్యక్రమంలో ఎంటిఎస్ గుమ్మ యుగంధర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పి. భీమవరం గ్రామానికి చెందిన కంఠంరెడ్డి ధనసాయి (19) అనే యువకుడు ఆదివారం బంగారుమెట్ట గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. యువకుని ఆరోగ్యం విషమంగా ఉండడంతో వైద్యానికి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు వివరాలివి. పి.భీమవరానికి చెందిన ధనసాయి బంగారుమెట్టలోని తన అమ్మమ్మ గారి ఇంట్లో ఉంటూ ఎలక్ట్రిషన్ పనులు చేస్తూ ఉంటాడు. కొద్దిరోజులుగా వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పనులకు వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో శనివారం బాలికల తల్లిదండ్రులతోపాటు హెచ్‌ఎం కూడా మందలించి ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆదివారం ఉదయం గడ్డి మందు కొనుగోలు చేసి తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న ధనసాయిని కుటుంబీకులు విశాఖ కెజిహెచ్‌కు తరలించగా వైద్యం పొందుతున్నాడు.

వృద్ధుని అదృశ్యం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం శివారు శ్రీరాంపురానికి చెందిన వృద్ధుడు పాతరపల్లి ఈశ్వరరావు కొద్దిరోజులుగా కనిపించడం లేదని ఆదివారం కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిపిన వారు బుచ్చయ్యపేట పోలీస్ స్టేషనుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దొన్ను దొరకు వినతిపత్రాన్ని ఇస్తున్న రైతులు

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలి

- దొన్ను దొరకు రైతుల వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయితీ మజ్జివలస గ్రామ పరిసరాల ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అనుమతి రద్దు చేయాలని, బూర్జ పంచాయితీ సర్పంచ్, పోరాట కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సియ్యారి దొన్నుదొరను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కొరకు గత కొన్ని రోజులుగా రాత్రిపూట డ్రోన్ కెమెరాలతో సర్వే జరుగుతుందని, దీంతో గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 28 న గ్రామ సభ కొరకు దండోరా, నోటీసు ఇచ్చి వాయిదా వేశారన్నారు.గిరిజన హక్కుల్ని కాలరాస్తూ పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే మా ఉనికిని కోల్పోతామని, వ్యవసాయ భూములు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.తరా తరాలుగా అడవి తల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని హైడ్రో ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే మా జీవన పరిస్థి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బూర్జ సూపర్ సర్పంచ్ పాంగి బొంజుబాబు,పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్ కుమార్,కో కన్వీనర్ మజ్జి కష్ణం రాజు,పిసా కమిటీ సభ్యులు గొల్లోరీ విజయ్ కుమార్,వార్డు మెంబర్ నన్ని విజయకుమార్, మజ్జి నాగేశ్వరరావు,మజ్జి రామరాజు, రాప బుద్దు, మజ్జి సురేష్ కుమార్, అల్లంగి బుద్ధు,బూర్జబారికి శ్రవణ్ కుమార్ ఉన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల2న చింతపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్, జనసేన నాయకుడు కిముడు కృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు సేకరించిన రక్తాన్ని నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి అందజేయనున్నట్లు తెలిపారు.

2న రాజ్‌మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- జికె వీధి: మండలంలో రైతులకు వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి గిరిబాబు ఆధ్వర్యంలో రైతులకు రాజ్మా విత్తనాలు 2వ తేదీన పంపిణీ చేయనున్నట్టు టిడిపి మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వచ్చి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

లారీ, బైక్ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం సున్నంపాడు గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా బొబ్బర్లంక గ్రామానికి చెందిన మర్రి రెడ్డి ఫణీంద్ర (37) మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చి తిరిగి వెళుతుండగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో ఆదివారం కట్టుదిట్టమైన భద్రత నడుమ వినాయక నిమజ్జనం చేశారు. శివాలయం వీధిలో నిర్వాహకులు ఆదివారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో వినాయకుని ఊరేగించి సిఆర్పిఎఫ్ పోలీసుభద్రత నడుమ స్థానిక రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రవీంద్ర

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-సీలేరు: గిరి రైతులకు ఎరువులు క్రిమిసంహారక మందులు అధిక ధరకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. జికె వీధి మండలం దారకొండ వారపు సంతలో ఆదివారం విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎరువులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎరువులు అధికధరకు విక్రయిస్తున్నట్టు పత్రికల్లో కథనాలు రావడంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. ఎవరైనా అధిక ధరకు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

దివ్య కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

దివ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పరామర్శ

ప్రజాశక్తి- రంపచోడవరం : మారేడుమిల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న జి.ఎమ్.వలసపంచాయితీ గొందివాడ గ్రామానికి చెందిన ఏడోతరగతి చదువుతున్న చేదల దివ్య శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో దివ్య మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి పరిశీలించి అనంతరం దివ్య తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కనీసం భద్రత లేకుండా పోయిందని దివ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలని వైసిపి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్

జికెవీధి: పిడి ఝాన్సీబాయ్‌కి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు మండల కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి-రంపచోడవరం : అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26,000 పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం రంపచోడవరం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ బహిరంగసభ నిర్వహించారు. పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కారం రామలక్ష్మి, అధ్యక్షులుగా సింగారమ్మ, ట్రెజరర్‌గా అర్జమ్మ, ఉపాధ్యక్షులుగా వెంకటలక్ష్మి, మరో 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాల ను నిర్మిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అంగన్‌వాడి జిల్లా కార్యదర్శి నిర్మల పిలుపునిచ్చారు. ఆదివారం మారేడుమిల్లిలో అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ మహాసభ బేబీ అధ్యక్షతన నిర్వహించారు. వెంకట్, నిర్మల మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులోకి పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. అనంతరం 17 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ప్రసూన, అధ్యక్షులుగా బేబీ, ట్రెజరర్‌గా సీతమ్మ ఉపాధ్యక్షులుగా వెంకటలక్ష్మి మరో 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాణి, నాయకులు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

జికెవీధి : అంగన్‌వాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని. సిఐటియు జీకే వీధి మండల కార్యదర్శి. జి సత్యనారాయణ. అంపురంగి బొజ్జిబాబు విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి జిల్లాప్రాజెక్టు డైరెక్టర్ చిట్టపులి ఝాన్సీభాయ్ (పిడి) జీకే వీధి మండలానికి వచ్చారు. సిఐటియు నాయకులు అంగన్‌వాడి అధ్యక్ష కార్యదర్శులతో వెళ్లి అంగన్‌వాడిల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పిడి సానుకూలంగా స్పందించారు. పని ప్రదేశంలో సమస్యలు ఉంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు, అప్పలనరస, సత్యవతి, వెంకటి పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ శంఖబ్రతబాగ్చీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 2న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం పర్యటన ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ కలిసి పరిశీలించారు. ముందుగా కోస్టల్ బ్యాటరీ వద్దగల హెలీప్యాడ్‌ను పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. హోటల్ నోవాటెల్ నందు మంగళవారం జరగబోయే ఈస్ట్ కోస్ట్ మారిటైం అండ్ లాజిస్టిక్ సమ్మిట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భాగస్వామ్యం కానున్నందున అక్కడ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలీప్యాడ్ దగ్గర ముందస్తు చర్యలు, దుమ్మూధూళీ రేగకుండా వాటరింగ్ చేయడం, విఐపిల లిస్టు సిద్ధం చేసుకోవడం, నోవాటెల్ హోటల్లో మూడు చోట్ల సమావేశాల నిర్వహణ, ముఖ్యమంత్రి గ్రీన్ రూమ్ ఏర్పాటు, సీటింగ్, విఐపి ప్రోటోకాల్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిసిపి అజిత, ఆర్‌డిఒ శ్రీలేఖ, జివిఎంసి ఎడిసి రమణమూర్తి, ఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు, అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, పోలీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ రానున్నట్టు తెలుస్తోంది. ఆయన షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

బీచ్ కబడ్డీ లీగ్ విజేత చంద్రంపాలెం

బీచ్ కబడ్డీ లీగ్ విజేత చంద్రంపాలెం జట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ కబడ్డీ లీగ్ విజేతగా విశాఖలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. పికెఎల్ సీజన్ 12లో ప్రారంభ ఆటకు ముందు వైజాగ్‌లోని పాఠశాలల కోసం బెంగాల్ వారియర్స్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఈ పోటీలు విశాఖలోని ఆర్‌కె బీచ్‌లో జరిగాయి. తుదకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురు, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచారు. ట్రోఫీ ప్రదానోత్సవంలో కాంటాక్ట్ స్పోర్ట్స్, బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవంక్ దలాల్, ప్రధాన కోచ్ నవీన్ కుమార్, బెంగాల్ వారియర్స్ జాంగ్ కున్ లీ, విశ్వాస్ పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల చికిత్సపై శిక్షణ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: భారతదేశంలో వైద్యుల నైపుణ్యాలను పెంపొందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్ , ఒలింపస్ మెడికల్ సిస్టమ్ సంయుక్తంగా ఒక ప్రగతిశీల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా పల్మనాలజీ నిపుణులకు అత్యాధునిక శిక్షణ అందించడాన్ని లక్ష్యంగా శిక్షణ నిర్వహించారు .ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన టెక్నాలజీపై వైద్యులకు సుదీర్ఘమైన సిద్ధాంత, ప్రాయోగిక పరిజ్ఞానం అందించనున్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌తాలే ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఆధునిక వైద్య శిక్షణను భారతదేశానికి తీసుకురావడం తమకు గర్వకారణమని, దీని వల్ల రోగులకు మెరుగైన చికిత్స అందించే అవకాశముంటుందన్నారు.

కుటుంబీకుల చెంతకు మహిళ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వ్యక్తి చేతిలో మోసపోయిన మహిళ ఎయుటిడి సంస్థ సహకారంతో తిరిగి కుటుంబీకుల చెంతకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడకు చెందిన వివాహిత సంధ్యను భర్త వదిలేసి వెళ్ళిపోయాడు. దీంతో వేరొకరి ఇంట్లో పని చేసుకుంటూ ఆమె పిల్లల్ని చదివిస్తోంది. పని ఇప్పిస్తానన్న ఒక దళారీ చెప్పుడు మాటలు విని ఆమె వైజాగ్ వచ్చింది. అతను మహిళను, ఆమె ఇద్దరు పిల్లలను ఆర్‌కె బీచ్‌లో వదిలి వెళ్లి పోయాడు. అటుగా వెళ్తున్న స్థానిక మహిళ వారిని గమనించి సమాచారం ఇచ్చిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. దీంతో తమ సంస్థ సిబ్బంది బీచ్ వద్దకు వెళ్లి ఆమెను పిల్లలతో సహా నిరాశ్రయుల షెల్టరుకి తీసుకొచ్చి వసతి కల్పించారన్నారు. తరువాత చైల్డ్ లైన్ దేవిని రప్పించి, కౌన్సిలింగ్ ఇప్పించామన్నారు. అనంతరం షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో తల్లీ పిల్లల్ని కాకినాడకు పంపించినట్టు తెలిపారు.

ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

వాసుపల్లి విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 36 వ వార్డు రంగిరీజు వీధిలో ఆర్‌ఆర్ బాయ్స్ ఆధ్వర్యంలో జరగనున్న అన్నదానానికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు విరాళం అందజేశారు. ఆదివారం ఆశీలమెట్ట కార్యాలయంలో నిర్వాహకులకు సొంత నిధులతో తన వంతు సాయం అందజేశారు. కార్యక్రమంలో సౌత్ వేవ్స్ వింగ్ ప్రెసిడెంట్ కాకి పద్మ, 36 వ వార్డ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షకిల్, జిల్లా బిసి సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్ తదితరులు పాల్గొన్నారు.

'డిఎస్‌సి నియామకాలు పారదర్శకంగా సాగాలి'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: డిఎస్‌సి - 2025 నియామక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఒ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎ.సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిఎస్‌సి పరీక్షా ఫలితాల విడుదల సమయంలో మెరిట్ జాబితాను ప్రకటించకుండా, అభ్యర్థులకు వ్యక్తిగత కాల్‌లెటర్స్ పంపుతామని ప్రకటించడం తో ఎదురైన వ్యతిరేకత, ఆందోళనల కారణంగా ఆగస్టు 22న మెరిట్ జాబితాను ప్రకటించారు. అయినప్పటికీ తదుపరి నియామక ప్రక్రియలో అనేక అవకతవ కలు చోటుచేసుకున్నాయన్నారు. కేవలం 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియలోనూ ఇంతటి నిర్లక్ష్యం, అవకతవకలు చోటుచేసుకోవడం సహించరానిదన్నారు. ఈ అవకతవకలను తక్షణమే సరిదిద్ది, అభ్యర్థులకు న్యాయం చేయాలని పిడిఎస్‌ఓ డిమాండ్ చేస్తోందన్నారు.